సాక్షి సంగారెడ్డి

సోమవారం । 25 । మార్చి । 2024

సంగారెడ్డిలో రంగుల అమ్మకాలు



ఆనందంగా ఆడేద్దాం

- రంగుల పండుగకు జిల్లావాసులు సిద్ధం
- కలర్స్ కొనుగోలులో నిమగ్నం
- సహజ రంగులు మాయం..
- మార్కెట్లో రసాయన కలర్స్ ప్రత్యక్షం
- నేడే హోలీ



ఝరాసంగం(జహీరాబాద్): వసంత కాలశోభ.. చీకటిని ఛేదించే పున్నమి వెన్నెల.. ప్రకృతి చైతన్యం .. రంగుల సౌందర్యంతో ప్రజలంతా కోలాహలంగా హోలీ పండగను జరుపుకుంటారు. చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా.. అంతరాలు మరచి ఉల్లాసంగా ఉత్సాహంగా రంగులు చల్లుకుంటారు. హోలీని చెడుపై మంచి సాధించిన విజయంగా కూడా భావిస్తారు. ఈ రంగుల పండగను సోమవారం ఆనందోత్సాహాల నడుమ ఆడుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. పిల్లలు రంగులు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు.

కనిపించని సహజరంగులు

ఈ రోజుల్లో హోలీ అనగానే రసాయన రంగులు తెచ్చి గుప్పుకుంటారు. వీటిని వాడటం ప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. గతంలో ప్రకృతి ఒడిలో లభించే పూలతో తయారు చేసే సహజ రంగులతో హోలీ ఆడేవారు. మోదుగు, శంకు, ఎర్రమందారం, గోరింటాకు తదితర పూలు, చెట్ల ఆకులతో సహజ రంగులు తయారు చేసేవారు. పూలు, ఆకులు ఎండబెట్టి.. వేడి నీళ్లలో నానబెట్టి రంగులు సిద్ధం చేసేవారు. వీటిని ఒంటిపై చల్లుకున్నా ఎలాంటి హాని ఉండేది కాదు. ఇంతకుముందు పల్లెల్లో మోదుగు పూలతో తయారు చేసిన రంగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. మండలంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థతో పాటు చాలాచోట్ల వివిధ రకాల పూలతో సహజరంగులు తయారు చేసుకుని పండుగను జరుపుకునే వారు. మారుతున్న కాలంతో పాటు సహజ రంగులు తయారు చేయడానికి స్వస్తి చెబుతున్నారు.

బాలగుండును ఎత్తడం ప్రత్యేకం



పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని కోళాపల్లి, మక్తలక్ష్మాపూర్ గ్రామాల్లో హోలీ పండగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. ప్రతియేటా ఆయా గ్రామపంచాయతీల వద్ద ఉంచిన ప్రత్యేక బాలగుండు రాళ్లను ఎత్తడానికి ప్రజలు పోటీ పడుతుంటారు. ఇవి 50 కిలోల నుంచి 100 కిలోల వరకు ఉంటాయి.

పిడిగుద్దులతో వేడుకలు



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి కొంతన్‌పల్లిలో హోలీ సంబురాలు వినూత్నంగా జరుపుకుంటారు. ఇక్కడ ఎన్నో ఏళ్లనుంచి వస్తున్న ఆచారాన్ని నేటికీ గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. హోలీ రోజు సాయంత్రం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద వతందారులందరూ చేరుకుని రెండు గ్రూపులుగా విడిపోయి తాడు కట్టి లాగుతారు. అనంతరం ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటారు. ఈ ఆటను గ్రామస్తులు ఆనందంగా ఆస్వాదిస్తారు.

ఎప్పటికి పూర్తయ్యేనో?

- ట్రబుల్స్ తీర్చని డబుల్ రోడ్ల విస్తరణ
- పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు
- ఇంకా పూర్తికాని డబుల్ రోడ్డు పనులు
- భూసేకరణే ఆటంకం



లచ్చునాయక్ తండా వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

కంగ్టి(నారాయణఖేడ్): కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు దాదాపుగా సరిహద్దులో ఉన్న కంగ్టి మండలం అభివృద్ధికి నోచడం లేదు. ఉప ఎన్నికల పుణ్యమా అని నారాయణఖేడ్ నుంచి కంగ్టి మీదుగా దెగుల్‌వాడి వద్ద రాష్ట్ర సరిహద్దు వరకు మంజూరు చేసిన రోడ్డు విస్తరణ ఇంకా పూర్తి కాలేదు. అప్పటి ఖేడ్ ఎమ్మెల్యే పి.కిష్టారెడ్డి 2015లో ఆకస్మికంగా మృతి చెందడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. ఖేడ్ నుండి కంగ్టి, దెగుల్‌వాడి మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు రూ.36 కోట్లు, కంగ్టి నుంచి తడ్కల్ మీదుగా అప్పటి నిజామాబాద్ జిల్లా సరిహద్దు ఎంపల్లి వరకు 16 కిలో మీటర్ల మేర రోడ్డు కోసం రూ.18.5కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఎనిమిదేళ్లవుతున్నా అవి ఇంకా పూర్తికాలేదు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గౌడ్‌గాం క్రాస్‌రోడ్డు నుంచి రాంతీర్థ్ వద్ద నల్లవాగు వంతెన వరకు పనులు నిర్వహించలేదు. సింగిల్ రోడ్డు ఉండడంతో పాటు మలుపులు ఉండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాగా కంగ్టి నుంచి తడ్కల్ వైపు వెళ్లే రోడ్డు సైతం కంగ్టి చౌరస్తా నుంచి చౌకన్‌పల్లి చౌరస్తా వరకు అధ్వానంగా ఉంది. కంగ్టి గ్రామానికి బైపాస్ రోడ్డు ఫార్మేషన్ వేసినా అదీ పూర్తి చేయలేదు. రూ.54.5 కోట్లకు పైగా డబ్బులు వెచ్చించినా పనులు పూర్తి స్థాయిలో జరగక పోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖేడ్ రోడ్డు విస్తరణకు వాసర్ గ్రామ రైతులు ఆయకట్టు భూమిని వదులుకోవడానికి ఇష్టపడలేదు. అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రోస్ వారితో మాట్లాడినా ఫలితం దక్కలేదు. దీంతో పనులకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు భావిస్తున్నారు. ఇదంతా ఇలా ఉండగా గత నవంబర్‌లో మరో 18 కిలో మీటర్ల మేర కంగ్టి నుంచి నాగుర్(కే) మీదుగా కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు మంజూరు చేశారు.

భూసేకరణే సమస్య



ఖేడ్ నుంచి కంగ్టికి వెళ్లే డబుల్ రోడ్డు పనుల్లో వాసర్ గ్రామానికి ఇరు వైపులా భూసేకరణకు సమస్యలు తలెత్తాయి. దీంతో దాదాపు 5 కిలోమీటర్ల మేర పనులు జరగలేదు. గౌడ్‌గాం చౌరస్తా నుంచి రాంతీర్థ్ రోడ్డు వరకు మూలమలుపులతో కూడిన సింగిల్ రోడ్డు ఉంది. కాగా రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇటీవల ప్యాచ్ వర్క్ చేసి గుంతలు పూడ్చివేశాం. భూసేకరణ పనులు పూర్తయితే తప్ప విస్తరణ పనులు చేపట్టే అవకాశం లేదు. – రాము, డీఈఈ ఆర్అండ్‌బీ, నారాయణఖేడ్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం (సాయంత్రం) 06:33

సహర్ : మంగళవారం (ఉదయం) 04:54

న్యూస్‌రీల్


పాదయాత్రకు ఘన స్వాగతం



పాదయాత్రలో పీఠాధిపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్) చేరుకున్న పాదయాత్ర-పల్లకి సేవా కార్యక్రమానికి పీఠాధిపతులు, నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. నారాయణఖేడ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకీ సేవ ఆదివారం ఉదయం మిర్జాపూర్(ఎన్)కు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతితో పాటు ఇతర పీఠాధిపతులు, భక్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర మహారాజ్ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్ర-పల్లకీ సేవ ముంగి మీదుగా హద్నూర్‌కు తరలి వెళ్లింది. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్, బీజేపీలకు లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మెదక్ పార్లమెంట్ జీహెచ్ఎంసీ 113 డివిజన్ పోలింగ్ బూత్‌ల పరిధి ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పడ్డాయని, బీజేపీ తొమ్మిదేళ్లలో ఒక్కటి కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు గెలిచి బీడీ గుర్తుపై ఉన్న పుర్రె బొమ్మను కూడా తీయించలేకపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి గతంలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుని సరైన పరిహారం ఇప్పించలేకపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మతిన్, యువరాజ్, కుంచాల కిషన్, అతీక్, ఆసిఫ్, గోపాల్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన నాచగిరి

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అర్చనలు, అభిషేకాలతో అలరారింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హరిద్రానది వాగులో పుణ్య స్నానాలాచరించారు. అనంతరం గర్భగుడిలో శ్రీవారిని దర్శించుకుని తరించారు.

కుట్టుకూలి అరకొరే!

గిట్టుబాటు కాని స్టిచ్చింగ్ చార్జీలు

- ఈసారి మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 2.77లక్షల మంది విద్యార్థులు
- ఒక్క జత కుడితే రూ.50లే ఇస్తున్న ప్రభుత్వం
- డిజైన్లు మారినా ఐదేళ్లుగా అవే ధరలు
- కూలి సరిపోవడంలేదంటున్న మహిళా సంఘాలు

పొదుపు సంఘాలలోని మహిళలకు ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పం. వారికి చేయూతనిచ్చేందుకు సర్కార్ బడుల్లోని విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే బాధ్యతను అప్పగించారు. దీంతో మహిళలంతా ఆనందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా కుట్టు కూలి విషయం వచ్చేసరికి నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ఒక్కో జతకు రూ.50మాత్రమే చెల్లిస్తోంది. ఇది సరిపోవడంలేదని, కూలిని పెంచాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు. విద్యా రంగానికి రూ.కోట్లు ఖర్చుచేస్తున్నామని పాలకులు చెబుతున్నా.. పేద విద్యార్థుల యూనిఫాంల కుట్టుకూలి విషయంలో పిసినారి తనం చూపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి, సిద్దిపేట: సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రతి ఏటా ఉచితంగా స్కూల్ యూనిఫాంలను ప్రభుత్వం అందజేస్తోంది. ఒక్కో విద్యార్థికి రెండేసి జతలను ఉచితంగా ఇస్తోంది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా క్లాత్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. 2024–2025 విద్యాసంవత్సరానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో 2,77,787 విద్యార్థులు ఉన్నారు. అందులో బాలురు 1,35,327 బాలికలు 1,42,460 ఉన్నారు. రెండేసి జతలు మొత్తం 5,55,574 డ్రెస్‌లకు గాను రూ 2,77,78,700 నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరందరికీ సైజుల ప్రకారం యూనిఫాంలు కుట్టించేందుకు మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అప్పగించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 31వ తేదీ వరకు క్లాత్‌ను అప్పగిస్తే జూన్1న పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అందించాలని ఆదేశించారు.

కూలి పెంచాలి

జిల్లాలకు స్కూల్ డ్రెస్‌లకు సంబంధించిన క్లాత్ త్వరలో రానున్న నేపథ్యంలో మహిళా పొదుపు సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలను అప్పగిస్తున్నారు.



కొండపాక మండలం శెలంపు ప్రభుత్వ పాఠశాలలో కుట్లు పోయిన నెక్కర్‌తో వచ్చిన విద్యార్థి(ఫైల్)

మొదట ఆనందం వ్యక్తం చేసిన మహిళా సంఘాల సభ్యులు కూలి ధరలను చూసి ఆశ్చర్యపోతున్నారు. మార్కెట్‌లో ఒక్కో డ్రెస్ స్టిచ్చింగ్ చేస్తే రూ.300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో డ్రెస్‌కు రూ.50 మాత్రమే చెల్లిస్తామని ప్రకటించడంతో మెటీరియల్‌కే సరిపోతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 200 గుండీల ప్యాకెట్ ధర రూ.150, మరో వైపు దారం బాక్స్ రూ.200 ఉంది. అలాగే జిప్స్ ఒక్కొక్కటి రూ.10 ఉంది. కాజాలు, గుండీలు కుట్టినందుకు ఒక్కో షర్టుకు రూ.20 నుంచి రూ30 వరకు తీసుకుంటారు. ఇలా ధరలు ఉండటంతో కూలి గిట్టుబాటు కాదని అంటున్నారు. ఒక్కో డ్రెస్‌కు కనీసం రూ.150 నుంచి రూ.200 వరకు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

కుట్టు బాధ్యతలు ఇవ్వడం సంతోషం



మహిళా పొదుపు సంఘాలకు స్కూల్ విద్యార్థుల డ్రెస్‌లు కుట్టే బాధ్యతలు ఇవ్వడం సంతోషం. ఒక్కో జత కుడితే రూ.50 మాత్రమే ఇస్తామని చెప్పడంతో నిరాశ చెందుతున్నాం. దారం, బటన్స్, జిప్స్ ఇతర మెటీరియల్‌కే సరిపోదు. ప్రభుత్వం ఆలోచించి ఒక్కో జతకు రూ.200లు చెల్లించాలి. అప్పుడే కూలి గిట్టుబాటవుతుంది.

– సాయన్నగారి భాగ్య, పెద్దకోడూరు, సిద్దిపేట

కనీసం రూ.150 ఇవ్వాలి



ప్రభుత్వం కుట్టు పని కల్పించి ఉపాధి చూపింది. ఒక డ్రెస్‌కు రూ.50 ఇస్తే కూలి గిట్టదు. కనీసం రూ.150 ఇస్తే మేలు. విద్యార్థుల డ్రెస్సులే కాకుండా హాస్టల్ పిల్లల డ్రెస్సులు కూడా మహిళా సంఘాలకే అప్పగించాలి. కుట్టిన వెంటనే బిల్లు మాకే చెల్లించాలి.

– బోయిని కనకతార, పోతారం (ఎస్), హుస్నాబాద్

ఐదేళ్లుగా ఇవే ధరలు

ఐదేళ్ల నుంచి ఒక్కో జతకు రూ.50లు చెల్లిస్తున్నారు. కుట్టు కూలి తక్కువగా ఇస్తుండటంతో కుట్టుల్లో నాణ్యత కరువవుతోంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కుట్టిన దారం పోవడంతో విద్యార్థులు పిన్నీస్‌లు పెట్టుకుని పాఠశాలకు వచ్చేవారు. మరోవైపు విద్యార్థుల శారీరక కొలతలు తీసుకోకుండానే కుట్టి అందించారు. అవి వదులుగా, పొట్టిగా, బిగుతుగా ఉన్నాయి. వారు వాటిని ధరించేందుకు ఇష్టం చూపడం లేదు. కుట్టు కూలి ధరలు పెంచకపోతే యూనిఫాం స్టిచ్చింగ్‌లలో నాణ్యత లోపాలు బయటపడే అవకాశాలున్నాయి. గతంలో మాదిరిగానే సమస్యలు పునరావృతం కానున్నాయి.

భువనగిరి బరిలో సీపీఎం



మాట్లాడుతున్న చుక్క రాములు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

పటాన్‌చెరు టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన పార్టీ సభ్యుల సమావేశంలో చుక్క రాములు మాట్లాడుతూ... ఎన్నికలలో లబ్ధి పొందాలని, కోడ్ అమలులో ఉన్నపుడు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఎలక్టోరల్ బాండ్స్‌తో లబ్ధి పొందుతుందన్నారు. మెజారిటీ ఎస్‌బీఐ బాండ్స్ బీజేపీకే ఉన్నాయని ఎలక్షన్ కమిషన్ బహిర్గతం చేసిందని గుర్తు చేశారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన ఎలక్షన్ బాండ్స్ ను సీపీఎం పార్టీ తోసిపుచ్చిందన్నారు. రాష్ట్రం లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరించడం వల్లనే అధికారం కోల్పోయిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు తప్పక అమలు చేయాలని కోరారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం పార్టీ బరిలో ఉంటుందన్నారు. అనంతరం పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎండీ వాజీద్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అర్జున్, ప్రసాద్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి



వెంచర్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ శివారు సర్వే నంబర్ 187, 188, 189లోని 27 ఎకరాల భూములను రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి పర్మిషన్లు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువలను కబ్జా చేసి మట్టితో నింపారన్నారని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మునిదేవునిపల్లి గ్రామంలో సర్వే నెం 92 సర్వే నంబర్ నుంచి ఎర్రమట్టిని తరలించి వెంచర్లలో రోడ్ల కోసం ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

- మళ్లీ కేంద్రంలో బీజేపీదే అధికారం
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్

న్యాల్‌కల్(జహీరాబాద్): సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్ ఆరోపించారు. మండల పరిధి మామిడ్గి గ్రామ శివారులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పాండురంగారెడ్డి, పాండురంగారావు పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప ఆధ్వర్యంలో బసంత్‌పూర్, రాజోల, గంగ్వార్, గణేషపూర్, మామిడ్గి తదితర గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు దూరమవుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తిరిగి మళ్లి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 400 కంటే అధిక స్థానాలు ఎన్డీఏ కూటమి గెలుచుకుంటుందన్నారు. తెలంగాణలోనూ బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తనకు మరో సారీ అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ జహీరాబాద్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు సుధీర్ కుమార్ బండారి, జగన్నాథ్, జనార్దన్‌రెడ్డి, ఓంకార్, మల్లేశం, రాహుల్, సతీష్‌గుప్త, అరవింద్ చౌహన్ పాల్గొన్నారు.

• దుర్గమ్మకు పల్లకీ సేవ

ఏడుపాయల వనదుర్గ ఆలయంలో ఆదివారం సాయంత్రం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవారిని దర్శించుకొని బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. - పాపన్నపేట(మెదక్)



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

• మల్లన్నకు పట్నాలు

కొమురవెల్లికి భక్తులు పోటెత్తారు. మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు దశకు చేరుకోవడంతో పదో ఆదివారం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. వేకువజామునే పుష్కరిణిలో స్నానాలు చేసి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, పట్నాలు వేశారు. ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. - కొమురవెల్లి(సిద్దిపేట)



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం

క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): చిన్నారిపై కోతులు దాడి చేసిన సంఘటన మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు పిటి వెంకటాపూర్ లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిన్నారి వెన్నెల(6)పై కోతులు దాడి చేశాయి. చుట్టుపక్కల వారు గమనించి తరిమి వేశారు. గాయపడిన చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

రెండు బెల్ట్ షాపులపై దాడులు

పోలీసుల అదుపులో ఇద్దరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రెండు బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ తండాలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడులు చేశారు. నిర్వాహకుడు రాజు నాయక్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 5.4లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఉస్మాన్‌నగర్ పరిధిలోని అపర్ణ లేబర్ క్యాంపు వద్ద నిర్వహిస్తున్న మరో బెల్ట్ షాపుపైనా దాడులు చేసి నిర్వాహకుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 17.28 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో, డీసీఎం ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో డీసీఎం, ట్రాలీ ఆటో

కౌడిపల్లి(నర్సాపూర్): డీసీఎం, ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొనగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కౌడిపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామానికి చెందిన కృష్ణ, చెన్నయ్య, శివ్వయ్య మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుంటారు. ఆదివారం తిమ్మాపూర్‌లో పని ఉండటంతో ట్రాలీ ఆటోలో సామగ్రి వేసుకొని వెళ్లి తిరిగొస్తున్నారు. రాయిలాపూర్‌గేట్ సమీపంలో ట్రాలీ ఆటో, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ట్రాలీ ఆటోలో ఉన్న ఈ ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఆపై లోపల ఇరుక్కు పోయారు. ఇటుగా వెళ్తున్న బాటసారులు గమనించి బయటికి తీశారు. అనంతరం క్షతగాత్రులను 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు.

గాయపడ్డ నెమలిని రక్షించిన రైతు



నెమలితో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రైతు వివేక్

హుస్నాబాద్‌రూరల్: గాయపడ్డ నెమలిని రైతు రక్షించాడు. మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన రైతు వివేక్ ఆదివారం పొలం వద్దకు వెళ్లాడు. పంట చేళ్లలో నెమలి ఎగురలేని స్థితిలో ఉండటాన్ని గమనించి వద్దకు వెళితే గాయమైందని గుర్తించాడు. దీంతో ఎగరడం లేదని గ్రహించి గ్రామస్తుల సహకారంతో పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చాడు. ఎస్సై మహేశ్ వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు స్టేషన్‌కు చేరుకోగా వన్యప్రాణిని అప్పగించారు. కాగా నెమలిని రక్షించిన వివేక్‌ను ఎస్సై మహేశ్ అభినందించారు.

భానుడి భగభగలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం పది దాటితే ఇళ్ల నుంచి బయటికి రాని జనం
- నిర్మానుష్యంగా రహదారులు





నిర్మానుష్యంగా మారిన సిద్దిపేట- మెదక్ ప్రధాన రహదారి

మిరుదొడ్డి(దుబ్బాక): రోజురోజుకూ ఎండ ప్రచండగా మారుతోంది. దీంతో గ్రామాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు జనాలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులున్నాయి. పట్టణాలు, ప్రధాన రహదారులతో పాటు, వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటితే వడగాలులు వీచే అవకాశాలు మెండుగా ఉంటాయి. మున్ముందు ఉమ్మడి జిల్లాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. విపరీతమైన ఎండలు కాసే సమయంలో విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు, కూలీలు బయట తిరగకుండా, పనులు చేసుకోకుండా ఉండటం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇక జీవాల పరిస్థితి ఇక వర్ణనాతీతం. వాటిని కాపాడుకోవడానికి కాపర్లు చెరువుల్లోకి గొర్లు మేకలను వదిలేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతే వేడి తీవ్రత పెరిగి వడ గాలులు వీస్తాయి. దీంతో వడ దెబ్బ (సన్ స్ట్రోక్) తగిలే ప్రమాదం ఉంది. ఒకవేళ దానికి గురైతే అపస్మారక స్థితికి చేరి మృత్యువాత పడే ప్రమాదం పొంచి ఉంటుందని డాక్టర్లు సైతం హెచ్చరిస్తున్నారు. ఎండలో ఎక్కువగా తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

లక్షణాలు

- పూర్తిగా నీరసించడం
- చెమట పట్టదు.. చైర్మం పూర్తిగా పొడిబారుతుంది.
- వాంతులు, విరేచనాలతో సొమ్మసిల్లుతారు.
- విపరీతంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- ఫిట్స్ లేదా అపస్మారక స్థితికి చేరుకుంటారు.

వైద్యం ఇలా

- వడ దెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి నీడ ప్రదేశానికి చేర్చాలి.
- శరీరానికి చల్లని గాలి లేదా ఫ్యాన్ గాలి తగిలేలా చూడాలి.
- తడి గుడ్డతో శరీరాన్ని తరచుగా తుడుస్తుండాలి.
- ఉప్పు కలిపిన చల్లని మజ్జిగ, లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి.
- వీలైనంత తొందరగా దగ్గరలోని ఆస్పత్రులకు తరలించి వెంటనే వైద్యం అందించాలి

జాగ్రత్తలు

- చల్లటి నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవ పదార్థాలను తీసుకోవాలి.
- ఎండలో ముదురు రంగు, నలుపు దుస్తులు వాడరాదు.
- లేత రంగులు కలిగి తేలికైన వదులు దుస్తులను వాడాలి.
- రోడ్ల మీద అమ్మే వేపుడు పదార్థాలను తగ్గించాలి.
- దోస, పుచ్చ, తాటి ముంజలతో పాటు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- మద్యం తాగరాదు. మాంసాహారాన్ని తగ్గించాలి.
- బయటకు వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపీ, జేబు రుమాలు, తలపాగాలు ధరించాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండలో తిరగకుండా ఇంటి నీడ పట్టున ఉంటే మంచిది.
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు చేయాలి.

ఎండలు మండుతున్నాయి



మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్నాను. ఈ సమయంలో వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నాను. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేసుకుంటున్నాను. పగలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతుంటే రాత్రి దోమలతో వేగలేక పోతున్నాం. మార్చిలోనే ఇంతగా ఎండలు మండుతున్నాయి. ఇక ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటాయోనని భయంగా ఉంది.

– కిషన్, రైతు, మిరుదొడ్డి

ఎండలో తిరగరాదు



వీలైనంత వరకు నీడపట్టున ఉండి పనులు చేయాలి. ఎండలోనే తిరిగి పనులు చేయాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. లేనిపక్షంలో వడ దెబ్బకు గురవుతారు. తల తిప్పడం, వాంతులు వీరేచనాలు కావడం, కళ్ళు తేలవేయడం, చర్మం పొడిబారి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

– డా. అమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

ఒకేసారి రెండు ఉద్యోగాలు



రవి, అతని తల్లిదండ్రులను సన్మానిస్తున్న గ్రామస్తులు

- పేదింట వికసించిన విద్యాకుసుమం.. వెంకటాపూర్(బి) యువకుడు రవి
- ఆర్థిక స్తోమత లేక.. అమ్మమ్మ వద్దే ఉండి చదువు

కౌడిపల్లి(నర్సాపూర్): కష్టాలు ఎన్ని ఉన్నా.. ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చంటారు. ఇది నిజం చేసి చూపాడు కౌడిపల్లి మండలం భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్(బి) గ్రామానికి చెందిన రవి. గ్రామానికి చెందిన నీరుడి సత్తయ్య, దుర్గమ్మలది నిరుపేద కుటుంబం. రెక్కడితే కాని డొక్కడని పరిస్థితి. గ్రామంలో సాగు సాగక పనులు లేక పట్నానికి వలస వెళ్లారు. వీరి కుమారుడు రవి. ఇతన్ని చదివించలేని పరిస్థితి వారిది. దీంతో బండపోతుగళ్ గ్రామంలో ఉండే అమ్మమ్మ వద్ద ఉండి 5వ తరగతి వరకు చదివాడు. జోగిపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ వరకు చదివాడు. ఇంటర్‌లో కాలేజీ టాపర్‌గా నిలిచాడు. డిగ్రీ బీకాంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. అనంతరం ఓయూలో ఎంకాం పూర్తిచేశారు. అక్కడే ఉండి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం ఓయూలో కామర్స్ పీహెచ్‌డీ చేస్తున్నాడు. పీహెచ్‌డీలో జేఆర్ఎఫ్ (జూనియర్ ఫెలోషిప్) పూర్తి కాగా ఎస్ఆర్ఎఫ్ చేస్తున్నాడు.

ఇటీవల అకౌంటెంట్..

ప్రభుత్వం ఇటీవల గురుకుల ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయగా ఎంజేపీ సొసైటీలో డిగ్రీ కామర్స్ లెక్చరర్ మల్టిజోన్ వన్ జనరల్ కోటాలో ఉద్యోగం రావడంతో ఆర్డర్ కాపీ సైతం తీసుకున్నాడు. దీంతోపాటు రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ జాబ్ సైతం వచ్చింది. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. ఒకే సారి రెండు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉదన్నారు. గ్రూప్ 1సైతం మొదటి దశ పూర్తి చేయగా రద్దు కావడంతో మరోసారి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రెండు ఉద్యోగాలు రావడంతో గ్రామస్తులు రవితోపాటు తల్లిదండ్రులను సన్మానించారు.

వ్యక్తి ఆత్మహత్య

గుమ్మడిదలలో ఘటన



కృష్ణ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గుమ్మడిదల మండలంలో జరిగింది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు అనంతారం గ్రామానికి చెందిన పెరుగు కృష్ణ (54) సంవత్సర నుంచి దవడ క్యాన్సర్ కు సంబంధించి చికిత్స తీసుకుంటున్నాడు. రెండు రోజులకోసారి హైదరాబాద్ వెళ్లి ఓ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నాడు. శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. అతడి కోడలు ఇంటి పక్కనున్న వ్యక్తితో కలిసి వెళ్లి చూస్తే పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే విషయాన్ని తన భర్త యాదగిరికి చెప్పగా.. ఇక్కడికి చేరుకొని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ అతను రాత్రి 11.10 నిమిషాల సమయంలో మృతిచెందాడు.

నిల్చున్నచోటే కబళించిన మృత్యువు

బస్సు అదుపు తప్పి ఢీకొట్టగా.. వ్యక్తి మృతి



టిఫిన్ డబ్బాను ఢీకొట్టి ఆగిన బస్సు, యాదయ్య(ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అదుపు తప్పిన బస్సు.. వ్యక్తిని మృత్యువు రూపంలో వెంటాడింది. ఈ సంఘటన పట్టణంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్‌టీఎస్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుంది. అతివేగంగా వెళ్తున్న ఆ బస్సు పాత రైల్వేట్రాక్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న రాజధాని హోటల్ వైపు దూసుకుపోయింది. అక్కడే నిలబడి ఉన్న శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన బీడీఎల్ కార్మికుడు యాదయ్య(58) పైకి బస్సు దూసుకుపోయి అక్కడే మూసిఉన్న ఓ టిఫిన్ సెంటర్ డబ్బాను ఢీకొట్టి ఆగిపోయింది. దాంతో యాదయ్య అక్కడిక్కడే దుర్మణం చెందాడు. మిగతావారు పరుగులు పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. డబ్బా లేకపోయి ఉంటే మరింత ప్రాణనష్టం జరిగేదని స్థానికులు వాపోయారు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

13 తులాల బంగారం, రూ.25 వేల నగదు తస్కరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పటాన్‌చెరు టౌన్: భోజనం కోసం బయటకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు దోచుకుపోయారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఇస్నాపూర్ శివారు బెంగళూరు వెంచర్‌లో జయశ్రీ తన కుటుంబంతో నివాసం ఉంటుంది. ఆమె స్క్రాప్ దుకాణం నడుపుతుంది. పిల్లలకు అనారోగ్యంగా ఉండటంతో షాద్‌నగర్ లో ఉంటున్న ఆమె సోదరుడు శంకర్ వద్దకు వెళ్లింది. దుకాణంలో ఆమె బంధువు అజయ్ ఉంటాడు. అతను ఆదివారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో భోజనం చేయడానికి బయటికెళ్లాడు. తిరిగి 40 నిమిషాల వ్యవధిలోనే వచ్చాడు. అప్పటికే ఇంటి గేటు, తలుపు తెరిచి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లి చూస్తే బీరువా పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 13 తులాల బంగారం, 25 వేల రూపాయల నగదు కనిపించలేదు దీంతో ఈ చోరీ జరిగిందని గ్రహించి బాధితుడు డయల్ 100కు కాల్ చేశాడు. పటాన్‌చెరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామప్పను సందర్శించిన న్యాయమూర్తులు



నందీశ్వరుని వద్ద న్యాయమూర్తులు



రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న న్యాయమూర్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయాన్ని ములుగు, కరీంనగర్, నిర్మల్, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల జడ్జిలు లలిత శివజ్యోతి, బి.ప్రతిమ, ఎ.కర్ణాకుమార్, పి.లక్ష్మీ శారద, పి.చంద్రశేఖరప్రసాద్, ఎస్.శ్రీదేవి ఆదివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం వారికి పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం నందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ శిల్పాకళాసంపద గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.

నిందితుడికి నాన్‌బెయిలబుల్ వారెంట్

రిమాండ్‌కు తరలించిన వన్‌టౌన్ పోలీసులు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: భార్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న భర్త కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కాగా అతడిని అదుపులోకి తీసుకొని సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ లక్ష్మీబాబు, ఎస్ఐ నరసింహ్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన కొక్కిలిగడ్డ శివకృష్ణ, లక్ష్మి అలియాస్ భారతి భార్యాభర్తలు. 2017లో బతుకుదెరువు కోసం సిద్దిపేటకు వచ్చి ఎల్లమ్మగుడి ఎర్రచెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. 2018 జులై 21న తల్లిదండ్రులు, అన్న సుబ్బారావులతో కలిసి భర్త శివకృష్ణ తన భార్యను చీరతో ఉరి వేసి హత్య చేశాడని మృతురాలి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా, నిందితుడు కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో పోలీసులు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో ఒంగోలులో శనివారం అదుపులోకి తీసుకుని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233900]

■ హైదరాబాద్‌లోని Zepto Company లో పనిచేయుటకు డెలివరి బాయ్స్ కావలెను జీతం + వసతి + Bike సౌకర్యం కలదు. సంప్ర।। ✆ 81255 12079 [O-192200]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చేదబావులు ఇక జ్ఞాపకమే!



మాచాపూర్‌లో చెత్తాచెదారానికి వాడుతున్న బావి

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల్లో చేదబావులు కనుమరుగవుతున్నాయి. గ్రామాల్లో పూర్వం ఇంటికో చేదబావి ఉండేది. వాటి ద్వారా ప్రజలు నీటిని తెచ్చుకునేవారు. ఇప్పుడు వీధుల్లో ఉన్నవి, ఇళ్లలోనివి కాలక్రమేణా పూడ్చి వేస్తున్నారు. కొన్నేమో నీరు లేక ఎండిపోవడంతో పరిసర ప్రాంతాల వారు చెత్తాచెదారం పోస్తున్నారు. కాలగమనంలో బోర్లు వినియోగంలోకి రాగా ఇళ్లల్లో మోటారు ఏర్పాటు చేసి నీటిని పొందుతున్నారు. దీంతో ఇవి కనుమరుగవుతున్నాయి.

సేంద్రియ సాగులో ఖర్జూర

- జిల్లాలో 13 ఎకరాల్లో పంట
- 800 మొక్కలు నాటిన సత్యనారాయణ
- రాయితీ ఇవ్వాలని వినతి



సాగులో ఖర్జూర

రామాయంపేట(మెదక్): సేంద్రియ పద్ధతిలో ఖర్జూర పంటను మేడ్చల్‌కు చెందిన సత్యనారాయణ సాగు చేస్తున్నారు. ఎడారి పంటగా పేరుగాంచిన ఖర్జూర తోటలు గుజరాత్, రాజస్థాన్, తమిళనాడులో సాగులో ఉన్నాయి. అక్కడ చూసి ఈ ప్రాంతంలో ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనను ఆచరణలోకి తెచ్చారు. శివారులో జాతీయ రహదారి పక్కనే 13 ఎకరాల్లో తోట సాగు చేస్తున్నాడు. ఎనిమిది వందల మొక్కలు నాటించి మల్చింగ్ పద్ధతిన ప్రతీ మొక్కకు డ్రిప్ ఏర్పాటు చేశారు. మల్చింగ్ పద్ధతిన 20 ఫీట్లకు ఒక మొక్క చొప్పున నాటి డ్రిప్ పైపుల ద్వారా తోటకు నీరు అందిస్తున్నారు. కాగా మూడున్నర ఏళ్లలోనే కొంత ఖాత వచ్చింది. సేంద్రియ పద్ధతి.. గోమూత్రం, ఆవుల పేడతో సాగు చేస్తున్నాడు. అయితే సాగు చేసే ముందు పలుమార్లు అనంతపూర్‌కు వెళ్లి పంటను పరిశీలించారు. 2019లో తమిళనాడుకు చెందిన నిజాముద్దీన్ సాయంతో ఇజ్రాయిల్ నుంచి బర్హీ రకం మొక్కలు తెప్పించి నాటించారు. మొదట్లో కొన్ని మొక్కలు చనిపోయినా అధైర్య పడకుండా మరిన్ని మొక్కలు తెప్పించి నాటాడు. ఒక్కో మొక్క ఖరీదు రూ.నాలుగున్నర వేలు ఉందని, ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే ఖర్జూర పంటతోపాటు జిలుగ, జామ, డ్రాగన్, అంజీర్, లక్ష్మణ్‌ఫల్ తదితర పంటను సాగు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉద్యాన అధికారి నర్సయ్య, మండల అధికారి సందీప్ ఇటీవల తోటను సందర్శించారు.


సహకారం అందించాలి



సాధారణంగా ఖర్జూర పంట సాగు మన ప్రాంతంలో వాతావరణానికి అనుకూలించదనే అనుమానాలుండేవి. ఈ పంట సాగు చేసి అనుమానాలు తొలగించాను. ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందించాలి. ప్రభుత్వం ముందుకొవచ్చి రాయితీ ఇస్తే చాలా మంది సాగు చేస్తారు. ఐదేళ్ల పంట ఇది, ముందు ఖర్చుపెట్టి జాగ్రత్తగా పంట సాగు చేస్తే మంచి లాభాలున్నాయి.

– సత్యనారాయణ

జిల్లాలో ఇక్కడ మాత్రమే..



రామాయంపేటలో సత్యనారాయణ సేంద్రియ పద్ధతిలో ఖర్జూర సాగు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇతర రైతులను చైతన్యపర్చడానికి కృషి చేస్తా. జిల్లాలో ఇక్కడ మాత్రమే ఖర్జూర పంట సాగవుతుంది. తోట బాగుంది.

– నర్సయ్య, జిల్లా ఉద్యాన అధికారి